# బతుకు తెరువు

అంపశయ్య నవీన్

"వానికి మంత్రాలొస్తయి.. వానితోటి జర్ర జాగ్రత్తగుండాలె" అన్నాడు మోహన్ చెరువు కట్టమీదినుండి నడిచి వెళ్తున్న గడ్డాలూ, మీసాలూ వున్న ఓవ్యక్తిని అతడి సహోద్యోగి రామస్వామికి చూపిస్తూ. వాళ్లిద్దరు ఆ ఊరి స్కూళ్లో టీచర్స్‌గా పనిచేస్తున్నారు. మోహన్ ఆ ఊరికి పాత వాడే. రామస్వామి ఆ ఊరికి కొత్తగా వచ్చాడు. వాళ్లిద్దరికి సాయంత్రం వేళ చెరువుకట్ట మీదికొచ్చి కాసేపు కూర్చొని కబుర్లు చెప్పుకోవడం అలవాటు.

"మంత్రాలు నిజంగా ఉన్నాయంటావా?" అన్నాడు రామస్వామి.

"లేకపోవడమేంటి.. నీకిప్పుడు చూపించానే.. వాడు తన మంత్రశక్తితో యేమైనా చెయ్యగలడు"

"యేమైనా చెయ్యగలడంటే?"

"వాడు తల్చుకుంటే నిన్ను ఈ క్షణంలో మసి చెయ్యగలడు. ఎవరికైనా దయ్యంపడ్తే దాన్ని వదిలించగలడు. నీ మీద మరో మంత్రగాడెవడన్నా చేతబడి చేస్తే దాన్నుండి నిన్ను రక్షించగలడు. ఊర్లో కలరాలాంటి అంటువ్యాధులొస్తే తన మంత్రశక్తితో కలరాకు కారణమైన దుష్టశక్తిని ఊర్లోంచి పంపించెయ్యగలడు"

"నాన్‌సెన్స్.. చదువులేని మూర్ఖులు ఈ మూఢ విశ్వాసాల్ని నమ్ముతున్నారంటే అర్థం చేసుకోవచ్చు. కానీ చదువుకున్న మనం కూడా ఈ మంత్రాలను, ఈ మూఢ విశ్వాసాలను ఈ క్షుద్రశక్తులను నమ్మటమేమిటి?" అన్నాడు రామస్వామి.

"మొదట్లో నేనూ నీలాగే అనుకునేటోణ్ని. కానీ ఈ మొగిలిని చూశాక.."

"మొగిలెవరు?"

"ఇప్పుడు నీకు చూపించానే మంత్రగాడని. ఆ పొడవైన గడ్డం.. నిమ్మకాయల్ని నిలపగల్గే మీసాలు.. వాన్ని చూస్తే పసిపిల్లలు జడుసుకుంటారు. వాని పేరే మొగిలి. వానింటిపేరు కునెపురం, వాన్నందరూ 'కునెపురం మొగిలి' అనడం మానేసి 'మంత్రాల మొగిలి' అంటున్నారు. వీని రూపాన్ని చూసినంక వీడు చేసే కొన్ని మహిమలూ, మాయలు చూసినంక నాక్కూడా మంత్రాలున్నాయన్న



నమ్మకం కలుగుతున్నది'' అన్నాడు మోహన్.

''అతడు నీకంత నమ్మకం కల్గించే మహిమలేం చేశాడేమిటి?''

''ఈ ప్రాంతంలో కొంతకాలం పనిచేసిన ధర్మారావు హెడ్‌మాస్టర్ పేరు నువ్వు వినే వుంటావు. ఈ ఊర్లో ఆయన కొంతకాలం హెడ్‌మాస్టర్‌గా పనిచేసిండు. ఆయనకో కూతురుండేది. ఆ అమ్మాయి సిటీలో ఇంటర్మీడియట్ చదువుతుండేది. అప్పుడప్పుడు ఇక్కడకు.. తండ్రి దగ్గరకు వస్తుండేది. ఆ పిల్లకు పదహారేళ్లుంటాయి. అకస్మాత్తుగా ఆ అమ్మాయి విచిత్రంగా ప్రవర్తించడం మొదలెట్టింది. తనంతటతనే నవ్వడం, తనలో తను మాట్లాడుకోవడం.. తనకు యేవేవో మాటలు వినిపిస్తున్నయనడం, తెల్లటి దుస్తులతో ఎవరో తనను వెంటాడుతున్నరని చెప్పడం.. మొదలెట్టింది. ఊర్లో అందరూ ఆ అమ్మాయికి దయ్యం పట్టిందన్నరు. మన హెడ్‌మాస్టర్‌గారికి ఊళ్ళోవాళ్ళందరూ ఆ అమ్మాయిని మొగిలి దగ్గరకు తీసికెళ్ళమని సలహా ఇచ్చిండ్రు. హెడ్‌మాస్టర్ గారికి మంత్రగాళ్ళ మీద నమ్మకముండేది. ఈ అమ్మాయిని మొగిలి దగ్గరకు తీసికెళ్ళిండు. ఆ అమ్మాయి మీద హెడ్‌మాస్టర్గారి శత్రువులెవరో ఓ గడుసు దయ్యాన్ని ప్రయోగించిండ్రని మొగిలి చెప్పిండు. మీ ఇంటి వెనుక ఓ మంత్రగాడు ఓ దుష్టశక్తిని పాతిపెట్టిండు. అదే మీ అమ్మాయిని పట్టుకుంది. కావాలంటే మీ ఇంటెనుకున్న వేపచెట్టు కింద తవ్వి ఆ దుష్టశక్తిని చూపిస్త పదండ్రి'' అంటూ మొగిలి హెడ్‌మాస్టర్‌గారు కిరాయికుంటున్న ఇంటికొచ్చి ఇంటివెనుక వేపచెట్టుకింద తవ్వాడు. నిజంగానే అక్కడ దయ్యం రూపంలో వున్న ఓ వికృతమైన బొమ్మ బయటపడింది''

''వీడే దాన్నక్కడ పాతుంటాడు''

''ఎప్పుడు పాతాడు? హెడ్‌మాస్టర్ గారికి కూతురు బాగాలేదని మన హెడ్‌మాస్టర్ మొగిలింటికెళ్లి చెప్పేంత వరకు మొగిలికీ విషయం ఎరికేలేదు. అంతకు ముందు ఈ మొగిలి హెడ్‌మాస్టర్ వుంటున్న ఛాయలక్కూడా రాలేదు గదా''

''పోనీయ్‌లే.. తర్వాతేమయింది?''

''హెడ్‌మాస్టర్ గారి కూతుర్ని కొన్ని రోజులు మొగిలింటికి పంపించిండు. '' ఓం.. హ్రీం'' అంటూ క్షుద్ర పూజలు చేసి ఆ అమ్మాయికి పట్టిన దయ్యాన్ని మొగిలి వదిలించిండు. ఆ అమ్మాయి మామూలు మనిషయిపోయింది. హెడ్‌మాస్టర్ గారు మొగిలికి ఓ వెయ్యి రూపాయలు సమర్పించుకున్నాడు''

''ఆ అమ్మాయికొచ్చింది హిస్టీరియాలాంటి యేదో మానసిక జబ్బయి వుంటుంది. కొన్నిసార్లు ఆ జబ్బు దానంతటదే తగ్గిపోయినట్టనిపిస్తుంది. లేక హిప్నోటిజం లాంటి యేవో ట్రిక్కులు చేసి కూడా మొగిలి లాంటి మంత్రగాళ్ళు ఇలాంటి జబ్బుల్ని తాత్కాలికంగా నయం చెయ్యొచ్చు. ఈ మొగిలి అనేవాడు తనకు మంత్రాలొస్తాయని ఈ ఊరి వాళ్లను నమ్మించడం కేవలం నాలుగురాళ్ళు సంపాదించుకోవడం కోసమే. మంత్రాల మహిమతో వాడు కరెన్సీ నోట్లనెందుకు సృష్టించుకోడు? ఇదంతా బతుకుతెరువు కోసం వాడు ఆడుతున్న నాటకం'' అన్నాడు రామస్వామి. ఇలా వాళ్ళిద్దరూ చాలాసేపు మంత్రాలున్నాయని ఒకరు, లేవని మరొకరు వాదించుకున్నారు.

ఇది జరిగిన వారం రోజుల తర్వాత ఆ ఊర్లో ముగ్గురు వ్యక్తులకు కలరా వ్యాధి సోకింది. పల్లెటూర్లలో కలరాను ''గత్తర'' అంటారు. వాంతులు విరేచనాలయి ఆ ముగ్గురు వ్యక్తులు వ్యాధి సోకిన మర్నాడే చనిపోయారు. వెంటనే ఊర్లో చాలామంది మొగిలి దగ్గరకు పరిగెత్తారు. మొగిలి అలా తన దగ్గరకొచ్చిన వాళ్ళందరి ఇళ్ళకు వెళ్లి తాయత్తులు కట్టాడు. ద్వారబంధాలకు శక్తి బొమ్మను కట్టాడు. మంత్రించిన నిమ్మకాయల్ని ఇంటిచుట్టూ వెదజల్లాడు. మీ ఇంట్లోకికయే దుష్టశక్తీ ప్రవేశించదని, మీ ఇంట్లో ఎవరికీ గత్తర సోకదని భరోసా ఇచ్చాడు.

ఈలోగా ఊర్లోని మరో ఇద్దరు వ్యక్తులకు వాంతులు విరేచనాలయ్యాయి. ఆ ఊరి సర్పంచ్ ఆ ఊరికి దగ్గర్లోనే ఉన్న మండల కేంద్రంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్ వారికి వార్తను తెలియజేశారు. హెల్త్ సెంటర్ వాళ్ళొచ్చి ఊర్లో అందరికీ యాంటీ కలరా ఇంజక్షన్లిచ్చారు. ఆ ఊరి ప్రజలు మంచినీళ్లు తెచ్చుకునే బావుల్లో బ్లీచింగ్ పౌడర్ కుమ్మరించారు. ఒక వైపు ప్రైమరీ హెల్త్ సెంటర్ వాళ్ళు ఈ పనులు చేస్తుండగానే మరో వైపు మొగిలి ఇల్లిల్లూ తిరుగుతూ అతడు చేసే వైద్యం చేస్తూనే వున్నాడు. చేతినిండా డబ్బులు దండుకుంటూనే వున్నాడు.

కొద్దిరోజుల్లోనే ఆ ఊర్లో కలరా వ్యాధి తగ్గుముఖం పట్టింది. ''నేనే నా మంత్రాలతో గత్తర రూపంలో ఈ ఊర్లోకి వచ్చిన ముత్యాలమ్మను వెళ్లగొట్టానని'' మొగిలి గర్వంగా చెప్పుకున్నాడు. ఈలోగా ఆ ఊర్లో మరో సంఘటన జరిగింది.

మొగిలికి ఇద్దరు తమ్ముళ్ళున్నారు. వాళ్ళకు తండ్రి సంపాదించి పోయిన ఓ పది ఎకరాల భూముంది. వాళ్ల తండ్రి చనిపోయిన చాలా రోజుల వరకు ఆ భూమిని వాళ్ళు పంచుకోలేదు. ఇప్పుడు పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. పంపకాల దగ్గర అన్నదమ్ముల మధ్య పెద్ద తగువు ప్రారంభమైంది.

''నేను పెద్దవాణ్ణి కాబట్టి పదెకరాల్లో సగభాగం నాకే రావాలని'' మొగిలి వాదించాడు. అతని ఇద్దరి తమ్ముళ్ళలో ఒకడైన రాజయ్యకు అన్నంటే చాలా భయం. అందుక్కారణం అతనికి మంత్రాలొస్తాయనే. అందుకే అతడు భూమిలో సగభాగం అన్నకివ్వడానికి వెంటనే అంగీకరించాడు. అందరికంటే చిన్నవాడైన సోమయ్య మాత్రం ''ముగ్గురం ఆ భూమిని సమానంగా పంచుకోవాల్సిందే'' నన్నాడు. రాజయ్య కొంతకాలం వాళ్ళూరికి దగ్గర్లోనే ఉండే జనగాం అనే టౌన్‌కెళ్ళి హైస్కూలు వరకు చదివాడు.

ఊర్లో ఎక్కువమంది మొగిలివైపే మాట్లాడారు. కొద్దిమంది యువకులు మాత్రం సోమయ్యవైపు నిల్చారు. ఆ ఊరి సర్పంచ్ కూడా మొగిలి వైపే మాట్లాడాడు. ఒకరోజు ఆ తగవును గూర్చి ఊర్లో పంచాయితీ జరిగింది. ఊరి పెద్దమనుషులందరూ పంచాయితీ ఆఫీసులోకి చేరారు.

''మొగిలి పెద్దోడు. ఇంతకాలం సంసార భారాన్ని నెత్తినేసుకున్నాడు. అందరికంటే పెద్దోడికి జ్యేష్టభాగం ఇవ్వడం వెనకట్నించి ఉన్నదే. కాబట్టి ఐదెకరాలు మొగిలికిచ్చి మిగతా ఐదెకరాల్ని మీరిద్దరు చెరి సగం తీసుకోండ్రి'' అన్నాడు ఆ ఊరి సర్పంచ్ గోనె రామయ్య.

''ఆయన మాకేం చెయ్యలేదు. యేమన్న జేస్తే మా నాయన జేసిండు. మానాయన పోయినప్పట్నించి మా బతుకు మేం బతికినం. ఆయన భూత వైద్యం చేసుకుంట చేతినిండ సంపాయించుకుంటున్నడు. దాంట్లో మాకేమన్నా ఇచ్చిండా? మేం తిండి లేకుంట ఉపాసం ఉంటె కూడా ఆయన మాకింత తిండి కూడా పెట్టలే. ఆయనకు జ్యేష్టభాగం మేమెందుకియ్యాలే? మా నాయనిచ్చి పోయిన భూమిని ముగ్గురం సమా



నంగా పంచుకోవాల్సిందే..'' అన్నాడు సోమయ్య.

సోమయ్య భార్య కూడా పెద్దమనుషుల మధ్యలోకొచ్చి ''ఆయనొక్కడే సగం భూమి తీసుకునుడు అన్యాయం. ఆయనకు మంత్రాలొస్తయని ఊర్లె అందరు ఆయనకు భయపడ్తున్నరు. గీ పంచాయితీని మీరు న్యాయంగా తప్పా చెయ్యండి.. మాకన్యాయం చెయ్యకుండ్రి. మేం పేదోళ్ళం, పిల్లలుగలోళ్ళం'' అని తన గోడంతా చెప్పుకుంది.

ఇలా ఓ పక్క పంచాయితీ జరుగుతోంటే మరో పక్క మొగిలియ్య భార్య ముత్తమ్మకు శివమొచ్చింది. ఆమెకు అప్పుడప్పుడు అకస్మాత్తుగా శివమొస్తుందని ఊర్లో అందరికి తెలుసు. శివమొచ్చినప్పుడు ఆమె చుట్టూ జనం గుమికూడ్తారు. ఆమె స్సాక్షాత్ ముత్యాలమ్మగా మారిందని భావిస్తారు. అప్పుడందరూ ఆమెను ఊర్లో యేం జరుగబోతున్నదో చెప్పమని అడుగుతారు. ఆమె ఊర్లో ఈ ఈ సంఘటనలు జరగబోతున్నాయని జోస్యం చెబుతుంది. ఆమె చెప్పేవన్నీ నిజమౌతాయని ఆ ఊర్లో ఉన్న వాళ్ళంతా నమ్ముతారు. పోయినసారి ఆ ఊర్లో పంచాయితి ఎన్నికలు జరిగినప్పుడు రెండు పార్టీలకు చెందిన అభ్యర్థుల మధ్య తీవ్రమైన పోటీ యేర్పడింది. ఎన్నికలు ఇంకో రెండ్రోజులున్నాయనంగా ముత్తమ్మకు శివమొచ్చింది. ఆమెనందరూ రేపటి ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎవరు గెలుస్తారో చెప్పమని అడిగారు. 'రాముని పేరు పెట్టుకున్నోడే గెలుస్తడ'ని చెప్పింది. దాంతో గోనె రామయ్యే గెలుస్తాడని ప్రజలంతా నమ్మారు. గెల్చేవానికే ఓటెయ్యడం మంచిదని ఆ ఊరి ప్రజలందరూ రామయ్యకే ఓటేశారు. రామయ్యే ప్రస్తుతం ఆ ఊరికి సర్పంచ్.

ఓడిపోయిన అభ్యర్థి నర్సిరెడ్డి గెల్చిన అభ్యర్థి రామయ్య మంత్రాల మొగిలికి ఓ పదివేల రూపాయలిచ్చి అతని భార్య ముత్తమ్మతో తను గెలవబోతున్నానని జోస్యం చెప్పించుకున్నాడని ఊరంతా ప్రచారం చేశాడు. అయినా అతని మాటల్ని ఎవరూ నమ్మలేదు.

ఇప్పుడు భూమి పంపకాలను గురించి పంచాయితి జరుగుతోంటే ముత్తమ్మకు మరోసారి శివమొచ్చింది. ''వాడు.. చిన్నోడు.. చిందులేస్తున్నప్పుడు. వానికి దుర్బుద్ధి పుట్టింది. వాన్ని తింట. వాని పెండ్లాన్ని తింట'' అంటూ జడలు విరబోసుకుని వేపమండలు చేతబట్టుకుని భయంకరంగా శివమూగుతూ అరవడం మొదలెట్టింది. ఎవరో పంచాయితీ ఆఫీసుకొచ్చి ముత్తమ్మకు శివమొచ్చిందని, సోమయ్యను తింట అంటున్నదని చెప్పారు.

అయినా సోమయ్య భయపడలేదు. ''ఈ ఎత్తులన్నీ మాకెరికే. నేను బెదిరిస్తే బెదిరేటోన్ని కాను. మాకు న్యాయంగా రావాల్సిన పాలు రాకుంట చేసేటందుకే మా వదినకిప్పుడు శివమొచ్చింది. మీరు న్యాయంగ పాళ్ళు పంచకపోతే నేను కోర్టుకుపోత'' అన్నాడు సోమయ్య.

పెద్దమనుషులు ఆ రోజంతా తర్జన భర్జనలు చేశారు. మొగిలియ్యకు సగభాగం ఇప్పించడానికి సర్పంచ్ రామయ్య తన పలుకుబడినంతా ఉపయోగించాడు. కానీ సోమయ్య తరపున ఓ ఎనమండుగురు యువకులు గట్టిగా వాదించారు. ఆ ఎనమండుగురికి శంకరయ్య అనే పట్నంలో బిఏ వరకూ చదువుకుంటున్న యువకుడు నాయకత్వం వహించాడు.

''ఇంకా చూస్తున్న
రేంది. అందరు రాండ్రి.
వాళ్ళను బయటకు
గుంజుదాం రాండ్రి. గీ
ముదనష్టపు మంత్ర
గాళ్ళను మనూర్లే ఉండ
నీయొద్దు. ఊర్లెనుంచి
వెళ్ళగొట్టేదాక మనం
నిద్రపోవద్దు. రాండ్రి.
అందరం కలిసి
వానింటి మీదకు
పోదాం. మొగుడు
పెండ్లాలనిద్దర్ని బయ
టకు గుంజుదాం.
రాండ్రి అందరు
రాండ్రి''

శంకరయ్య, సోమయ్యలు పదో తరగతి వరకు క్లాస్‌మేట్స్.

''మొగిలికి మంత్రాలొస్తయని భయపడి మీరిట్ల మాట్లాడ్తున్నరు. ముగ్గురన్నదమ్ములు తండ్రి ఆస్తిని సరిసమానంగా పంచుకోవాల్సిందే. దీంట్లో యే మాత్రం తేడా వచ్చినా సోమయ్య ఒప్పుకోడు'' అన్నాడు శంకరయ్య. ఆ ఊరి మిగతా యువకులంతా శంకరయ్యకు మద్దతుగా నిల్చారు.

చివరకు శంకరయ్య మాటే నెగ్గింది.

పదెకరాల్ని ముగ్గురన్నదమ్ములు సమానంగా పంచుకోవాలని పెద్దమనుషులు తీర్మానించారు. ''నాకింత అన్యాయం చేసి ఈ ఊర్లె నువ్వెట్లుంటవో చూస్త'' అని శంకరయ్యతో ఛాలెంజ్ చేస్తూ మొగిలి కోపంగా పంచాయితీ జరుగుతున్న ప్రదేశం నుంచి వెళ్ళిపోయాడు.

''పోరాపో.. నీ మంత్రాలతో నన్నేమో చేద్దామనుకుంటున్నవ్ గావొచ్చు. నీ మంత్రాలకు చింతకాయలు కూడా రాలవు. నువ్వు నన్నేం చేస్తవురా'' అన్నాడు శంకరయ్య.

శంకరయ్యకో, సోమయ్యకో త్వరలోనే యేదో కీడు జరుగుతుందని ఊర్లో చాలామంది అనుకున్నారు. కానీ అలాంటిదేమీ జరగలేదు.

ముగ్గురన్నదమ్ములు సరిసమానంగా వాళ్ళ భూముల్ని పంచుకున్నరు.

మొగిలియ్య దగ్గరకు వైద్యం కోసం ఆ ఊర్నించే కాకుండా వేరే ఊర్లనుండి కూడా ప్రజలు రావడం మొదలెట్టారు. దయ్యం పట్టిందని కొందరు, మాకొవరో చేతబడి చేశాడని కొందరు, మా ఊర్లో యే కారణం లేకుండానే మా బంధువులిద్దరు చనిపోయారని కొందరు ఇలా రకరకాల కారణాలతో ప్రజలు మొగిలయ్య దగ్గరకువస్తున్నారు. క్షుద్రశక్తుల కారణంగానే ఇలా జరుగుతున్నదనీ, తన మంత్ర శక్తులతో క్షుద్రశక్తుల్ని పారద్రోలుతానని చెప్పి మొగిలయ్య తన దగ్గరకొచ్చిన వాళ్ల దగ్గర్నించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడం మొదలెట్టాడు. తన దగ్గరకొచ్చిన వాళ్లతో యేవేవో క్షుద్ర పూజలు చేయిస్తూనే వున్నాడు.

ఆర్థికంగా మొగిలయ్య పరిస్థితి చాలా మెరుగైంది. అతని ఇద్దరి తమ్ముళ్ళ పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. వాళ్లిద్దరూ అటు వ్యవసాయం, ఇటు కుల వృత్తి వడ్రంగం చేసుకునేవాళ్ళు. పెద్దగా గిట్టుబాటయ్యేది కాదు.

ఓ సంవత్సరం గడిచిపోయింది. ఒకరోజు మొగిలయ్య తమ్ముడు సోమయ్యకు అతని భార్య నర్సమ్మకు ఒకేసారి వాంతులూ, విరేచనాలయ్యాయి. తెల్లారేటప్పటికి వాళ్లిద్దరూ చనిపోయారు. ఇంత అకస్మాత్తుగా ఇద్దరు వ్యక్తులు చనిపోవడమేమిటని ఊరు ఊరంతా దిగ్భ్రాంతి చెందింది.

''వాళ్లిద్దర్ని మొగిలయ్యే చేతబడి చేసి చంపించిండని'' ఊర్లో గుసగుసలు ప్రారంభమయ్యాయి.

పోయిన ఎన్నికల్లో రామయ్య చేతిలో ఓడిపోయిన నర్సిరెడ్డి ఈ గుసగుసలకు ఆజ్యం పోశాడు. బిఏ పూర్తిచేసిన శంకరయ్య కొంతకాలం యేదన్నా ఉద్యోగం చేద్దామని ప్రయత్నించాడు. కానీ అతనికే ఉద్యోగమూ దొరక్కపోవడంతో స్వగ్రామానికొచ్చి వ్యవసాయం చేసుకోవడం మొదలెట్టాడు. సోమయ్య, అతని భార్య నర్సమ్మ అకస్మాత్తుగా చనిపోయారన్న వార్త శంకరయ్యను షాక్‌కు గురిచేసింది. నర్సిరెడ్డి అతని దగ్గరకెళ్ళి మొగిలయ్యే చేతబడి చేసి తమ్ముణ్ణి, మరదల్ని చంపించాడని చెప్పాడు.

రెండ్రోజుల తర్వాత నర్సిరెడ్డి, శంకరయ్య కలిసి ఆ ఊర్లో ఓ మీటింగ్ పెట్టారు. ఊర్లో చాలామంది ఆ మీటింగుకొచ్చారు. శంకరయ్య చాలా ఆవేశంగా మాట్లాడాడు.

''మొగిలయ్యకు మంత్రాలొస్తాయని మనందరికీ ఎరికే. వానికి సోమయ్య మీద చాలా పగుంది. తనడిగినట్టుగా భూమిలో సగభాగం ఇవ్వలేదని వాడు సోమయ్య మీద పగబట్టిండు. వానికి వాని పెండ్లానికి మనం తగిన బుద్ధి చెప్పకపోతే వాడీ ఊర్లె ఇంకెంతమందిని చంపుతడో. వాని మంత్రాలు పారకుండ ఉండాల్నంటే వాని ముందు పండ్లూడగొట్టాలె. వాని మీసాలు పీకెయ్యాలె. వాని గడ్డాన్ని పీకెయ్యాలె. వాన్ని ఊర్లెనుంచి వెళ్లగొట్టాలె'' అన్నాడు శంకరయ్య.

'' ఔను. వాని పండ్లూడగొట్టాలె. వాని పెండ్లానికి గుండు గొరిగించాలె'' అన్నాడు నర్సిరెడ్డి.

''వాళ్లిద్దర్ని ఊర్లెనుంచి యెళ్లగొట్టాలె. ఇప్పుడే. ఈ క్షణమే. వాళ్ల పండ్లూడదీసి, గుండ్లు గొరిగించి చెప్పులదండేసి గాడిదమీద ఊరేగించి ఊర్లెనుంచి వెళ్ళగొట్టాలె'' అన్నాడు శంకరయ్య కెప్పుడూ కుడి భజంగా నిలిచే రంగస్వామి.

''అంతే.. అంతే.. ఇప్పుడే వాళ్లను ఊర్లెనుంచి వెళ్లగొట్టాలె. వానిల్లు తగుల బెట్టాలె'' అంటూ ఆ ఊర్లోని యువకులంతా అరిచారు.

'' ఇల్లు తగులబెట్టుడే కాదు. వాళ్ళను కూడా తగులబెట్టాలె. రేపు పోలీసులొస్తే వాళ్ళకేమీ సాక్ష్యం దొరక్కుంట చెయ్యాలె'' అంటూ మరొక యువకుడు అరిచాడు.

ఆ మీటింగ్‌లో ఉన్న స్త్రీలు ''సోమయ్య పెండ్లం చాలా మంచిది. దాన్ని దాని యేరాలు ముత్తమ్మే మింగింది. దానికి మనం బుద్ధి చెప్పకపోతే అది ఈ ఊరినంత తింటది.. దాని శిఖపట్టి బయటికి గుంజాలె. దాని పండ్లూడగొట్టాలె. దానికి గుండు గొరిగించాలె'' అంటూ పెద్ద పెట్టున అరిచారు.

''ఇంకా చూస్తున్నరేంది. అందరు రాండ్రి. వాళ్ళను బయటకు గుంజుదాం రాండ్రి. గీ ముదనష్టపు మంత్రగాళ్ళను మనూర్లే ఉండనీయొద్దు. ఊర్లెనుంచి వెళ్ళగొట్టేదాక మనం నిద్రపోవద్దు. రాండ్రి. అందరం కలిసి వానింటి మీదకు పోదాం. మొగుడు పెండ్లాలనిద్దర్ని బయటకు గుంజుదాం. రాండ్రి అందరు రాండ్రి'' అన్నాడు శంకరయ్య.

''రాండ్రి.. అందరు రాండ్రి.. అందరం ఒక్కటైతే మనల ఎవ్వడేం చెయ్యలేడు. రేపు పోలీసులొచ్చినా అందరం ఒక్కటే మాట మీదుండాలె'' అన్నాడు నర్సిరెడ్డి.

''గట్లనే.. అందరం కలిసే ఈ పనిచెయ్యాలె. అందరం ఒక్కమాట మీదనే ఉండాలె. రాండ్రి కదులుండ్రి. అందరు ఒక్కలై కదులుండ్రి.. రాండ్రి''

అన్నాడు శంకరయ్య. అంటూనే ముందుకు నడిచాడు. నర్సిరెడ్డి అతన్ని అనుసరించాడు. మిగతా ప్రజలంతా వాళ్లననుసరించారు. జనం ప్రవాహంలా ముందుకురికారు. వాళ్ళు వ్యక్తులుగా అంతరించి, గుంపుగా మారారు. ఆ గుంపు ఒక్క పెట్టున మొగిలయ్య ఇంటిమీద విరుచుకుపడింది. పక్కగ్రామం నుండొచ్చిన ఇద్దరు వ్యక్తులతో క్షుద్రపూజ చేయిస్తున్న మొగిలయ్యనూ, అతని భార్యనూ ఆ గుంపు బయటకు గుంజారు.మొగిలయ్య గడ్డాన్ని పట్టి లాగారు. అతని మీసాలను పీకేశారు. వాళ్లమీద పడి కర్రలతో బాదడం మొదలెట్టారు. ఇద్దర్నీ వీధిలో ఉన్న కరెంట్ స్తంభాలకు కట్టేశారు. ఎవరో ఎక్కడ్నించో వస్తువుల్ని పట్టుకుని లాగే పట్కార్లను తెచ్చారు. ఇద్దరు యువకులు దాంతో మొగిలయ్య ముందు పళ్ళను పట్కార్‌తో లాగడం మొదలెట్టారు. మొగిలయ్య బాధతో విలవిల్లాడిపోతున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఇద్దరు స్త్రీలు వెళ్లి మొగిలయ్య భార్య పళ్లను రాళ్ళతో కొట్టి ఊడబెరికారు. వాళ్ళిద్దరి నోట్లోంచి రక్తం పారింది. ఎవరో వెళ్లి మంగలి వాళ్లను తీసుకొచ్చారు. వాళ్ళొచ్చి మొగిలయ్యకూ, అతని భార్యకూ గుండ్లు కొరగడం మొదలెట్టారు.

ఎవరో ఎక్కడ్నించో వస్తువుల్ని పట్టుకుని లాగే పట్కార్లను తెచ్చారు. ఇద్దరు యువకులు దాంతో మొగిలయ్య ముందు పళ్ళను పట్కార్‌తో లాగడం మొదలెట్టారు. మొగిలయ్య బాధతో విలవిల్లాడిపోతున్నా ఎవరూ పట్టించుకోలేదు.

"మాకు మంత్రాలు రావు. మేం బతుకుదెరువు కోసమే మంత్రాలొచ్చినట్టు నాటకమాడినం.. మమ్ముల వదిలి పెట్టుండ్రి. మేమీ ఊర్లెనుంచి వెళ్ళిపోతం" అంటూ మొగిలయ్య పెద్ద పెట్టున ఏడుస్తూ అరిచాడు. అతని భార్య కూడా అలాగే అరవడం మొదలెట్టింది. వాళ్ళిద్దరు చేతులు జోడించి అందరికీ దండాలు పెట్టారు.

"మిమ్ములను వదిలిపెట్టుడా? ఇక్కడ్నే పాతిపెడ్తం.. కాల్చి పారేస్తం. మీరీ ఊర్లె ఎంతమందిని చంపిండ్రో మా కెరుక లేదనుకుంటాండ్రా.." అన్నాడు శంకరయ్య.

"మేమెవర్నీ చంపలేదు. మాకు మంత్రాలు రావు. బతుకుతెరువు కోసం మంత్రాలొస్తయన్నం. మమ్ముల వదులుండ్రి. మీ బాంచెను. మీ కాల్మొక్త" అంటూ పెద్ద పెట్టున ఏడ్వసాగాడు మొగిలయ్య. ఎవరో వెళ్ళి మొగిలయ్య ఇంటిమీద కిరసనాయిలు పోసి నిప్పుపెట్టారు. గుప్పుమని మంటలు పైకెగిశాయి.

"వాళ్లను ఆ మంటలల్ల పడేద్దాం. ఇద్దరు కాలి బూడిదై పోవాలె" అని అరిచారెవరో.

"గంతే.. గంతే.. వీల్లను కూడా ఆ మంటలల్ల పడేయండ్రి" మరొకరు అరిచారు.

అదో గుంపు.. గుంపంతా ఒక్క వ్యక్తిగా మారింది. ఎవరేదంటే అది అమలయిపోయింది.

"మీ కాల్మొక్తం.. మీ బాంచెనయితం. మమ్ముల సంపకండ్రి. మేమేం చెయ్యలేదు. ఎవర్ని సంపలేదు. బతుకుదెరువు కోసం గీ మంత్రాల దందా జేస్తున్నం. మమ్ముల సంపకుండ్రి. మమ్ముల సంపకుండ్రి.. మాకు మంత్రాలు రావు" అంటూ మొగిలయ్య భార్య అదేపనిగా అరవడం మొదలెట్టింది.

మొగిలయ్య అతని భార్య చేతులు జోడించి అరుస్తూనే వున్నారు. భోరుమని యేడుస్తూనే వున్నారు. వాళ్లమాటలు ఆ గుంపుకు వినిపించలేదు. వాళ్లిద్దరి కాళ్ళు చేతుల్ని తాళ్ళతో కట్టేశారు. అందరూ కలిసి ఆ ఇద్దర్నీ మంటల్లోకి విసిరేశారు. వాళ్ళు కాలి బూడిదవుతోంటే అందరూ పెద్ద పెట్టున " ఈ ఊరి శని వదిలింది" అంటూ అరిచారు.

మర్నాడు ఊళ్లోకి పోలీసులొచ్చారు. వాళ్ళిద్దర్నీ ఎవ్వరు కాల్చి చంపారో వాళ్ళకెవరూ చెప్పలేదు. యేవేవో పరీక్షలు చేసినట్టు చేశారు. సర్పంచ్ రామయ్యను విచారించారు.

సర్పంచ్ రామయ్య కూడా నోరు మూసుకున్నాడే గానీ ఫలానా వాళ్ళు ఈ పనిచేశారని చెప్పలేకపోయాడు. ఊరు ఊరంతా ఏకమైంది కాబట్టి ఎవరి పేరు చెప్పినా రేపు ఆ ఊర్లో తనకు ఒక్కరు కూడా ఓటెయ్యరనీ, మౌనాన్ని పాటించడమే క్షేమమని ఆయనకు ఆయన అనుచరులు సలహా యిచ్చారు. ఆయన ఆ సలహాను తు.చ.తప్పకుండా పాటించాడు.

* * *

ఇది జరిగిన రెండ్రోజుల తర్వాత-

మోహన్, రామస్వామి ఆ ఊరి చెరువు కట్టమీదికి వాకింగ్ కొచ్చారు.

"మొగిలికి నిజంగా మంత్రాలు రావంటావా? బతుకుతెరువు కోసమే మంత్రాలొచ్చినట్టుగా నాటకమాడిండంటావా?" అన్నాడు మోహన్.

"అందుకు సందేహమా?" అన్నాడు మోహన్.

"అతనికి నిజంగానే మంత్రాలొచ్చి వుంటే ఆయన స్వాధీనంలో ఉన్న క్షుద్రశక్తుల్ని తనను ఎటాక్ చెయ్యడానికొస్తున్న గుంపుమీద ప్రయోగించేవాడు కాదా? మంత్రశక్తితో తననూ, తన భార్యనూ కాపాడుకునేవాడు కాదా?" అన్నాడు రామస్వామి.

"శంకరయ్యకూ, నర్సిరెడ్డికీ మొగిలికి మంత్రాలు రావన్న సంగతి తెలియదంటావా?"

"తెలుసుననే నా అభిప్రాయం. అయినా అతన్ని తొలగించుకోవడానికొచ్చిన అవకాశాన్ని వాళ్ళు ఉపయోగించుకున్నారు. గ్రామాల్లో ఇవ్వాళ ప్రతీదీ రాజకీయమే అయిపోయింది" అన్నాడు రామస్వామి.

"ఈ మూఢ విశ్వాసాలకు అంతం లేదంటావా?"

"మనిషిలో అభద్రతాభావం ఉన్నంత కాలం మూఢ విశ్వాసాలు కొనసాగుతూనే వుంటాయి. ప్రప్రథమంగా మనకు మనమీద, మన పక్కవాళ్ళ మీద నమ్మకమేర్పడాలి. మనం యేం చెయ్యలేం. మన చేతుల్లో యేమీ లేదు. యేదో మానవాతీత శక్తి మనల్ని శాసిస్తోంది. మనల్ని పాలిస్తోంది. అని మనిషి అనుకుంటున్నంత కాలం అతడు మూఢ విశ్వాసాల్ని ఆశ్రయిస్తూనే వుంటాడు. ఈ విషయం చదువుకున్న వాళ్ళకూ, చదువుకోని వాళ్ళకూ మధ్య పెద్ద తేడా లేకపోవడమే బాధాకరం. మనిషి ఒక భ్రమలో పడిపోయి మంత్రగాళ్లని ఆశ్రయిస్తున్నాడు. బ్రతుకు తెరువు కోసం నాకు మంత్రాలొస్తాయంటూ కొందరు దాన్నొక వృత్తిగా మార్చుకుంటున్నారు. మంత్రాలొస్తాయని ప్రచారం చేసుకోవడం వల్ల ఒక రోజు తమ ప్రాణాల మీదకే వస్తుందని వాళ్ళు గుర్తించలేకపోతున్నారు" అన్నాడు రామస్వామి. ■



ఆధునిక దంత వైద్యం
ప్రొ॥ డా॥ పి.వి.పార్థసారథి
M.D.S., F.A.A.C.D. (USA)
కాస్మటిక్ డెంటల్ స్పెషలిస్ట్

చక్కటి పలువరుసతో ఆరోగ్యంగా నవ్వాలని నాకు ఎంతగానో కోరిక. పళ్ళ మధ్య సంధులొచ్చి ఎంతో ఇబ్బంది పడ్డా. ఇక ఈ వయసులో చికిత్స సాధ్యం కాదని అనుకున్నా!!!

కాస్మటిక్ దంత వైద్యానికి వయసుతో సంబంధం లేదని పత్రికల్లో చదివి డాక్టర్ని కలిసి 'స్మైల్ డిజైనింగ్' చేయించుకున్నా. రెండు సిట్టింగ్స్‌లో నా సమస్యను తీర్చేశారు. ఇప్పుడెంతో హాయిగా నవ్వగల్గుతున్నా!!!
పార్థ దంత వైద్యశాల & రీసర్చి సెంటర్
RTC బస్టాండ్ వెనుక, పెద్దకాపు లే ఔట్, శ్రీనివాసం కాంప్లెక్స్ ఎదురుగా, తిరుపతి.
Ph:0877-2250555, 2250105
★ నామమాత్రపు ఫీజులతో 'ఆధునిక దంత వైద్యం' మీ కోసం!! ★